కథానిక — ఆర్. వసుంధరాదేవి

# ఈ ఆడోళ్ళనెవ్వరూ బాగుజెయ్యలేరు



మనిషి నైజంలో పలు కోణాలను పట్టిచూపే ఈ కథానికకు వాస్తవ జీవితమే నేపథ్యం. అదే పల్లెకథలు అల్లే వసుంధరాదేవి కనబరిచే వైవిధ్యం.

ఆ ఎనిమిదిమంది స్త్రీలూ హాయిగా కబుర్లు చెప్పుకుంటూ మదనపల్లె నుంచి సంజెయ్‌పేటకు నడిచి వెళ్తున్నారు వెన్నెట్లో. వాళ్ళందరూ ఇరవైకీ నలభైకీ మధ్య వయసులో ఉన్నవాళ్ళే. అందరికీ ఒక చేతిలో సంచీనో, గంపో ఉన్నవి. రెండో చెయ్యి వాళ్ళ కులాసా కబుర్లకీ, కేరింతలకీ అనుగుణంగా స్వేచ్ఛగా ఊగుతూ, వారి మాటల్లోని భావాల కనుగుణంగా విన్యాసాలు చేస్తున్నది. మదనపల్లె పట్టణంలో రోజువారీ పని పాటులూ వ్యాపారాలూ పూర్తిచేసుకుని ఏవో కారణాలకు ఆలస్యంకాగా, నాలుగు కిలోమీటర్లు నడిచి ఇళ్ళు చేరుకోబోతున్న చివరి బాచి వాళ్ళది. వాళ్ళందరికీ సంజెయ్ పేటలో గవర్నమెంటు కట్టించి ఇచ్చిన ఇళ్ళున్నవి. ఒక చిన్న వంటగదీ, ఒక హాలూ - చిన్న అగ్గిపెట్టెల్లాంటి ఇళ్ళు. నెల నెలా డెబ్బై రూపాయలు కట్టి పదేళ్ళలో ఆ ఇండ్లతాలూకు బాకీలు తీర్చేసుకోబోతున్నారు. ఇళ్ళు సంపాదించినందుకు వాళ్ళు సంతోషంగా, గర్వంగా ఉన్నారు.

మదనపల్లె పట్టణంలోని ప్రతి సందూ, ప్రతి గొందీ రోడ్డులోకి ఈనుతున్న జనాల కోలాహలంలోనుంచి అలవాటైన ఆట ఆడుతున్నట్లు అవలీలగా ప్రవహించి వచ్చారు వాళ్ళు ఎనిమిదిమందీ. ఊరు వెనకబడుతుంటే రోడ్డు కిరువైపులా ఉండే ఇండ్ల మధ్యన ఖాళీ చోట్లు కన్పిస్తున్నవి. పైనుంచి కురుస్తున్న వెన్నెట్లో కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు వాళ్ళు.

ఆ ఎనిమిదిమందిలోనూ అయిదుగురి పేర్లు ధనదేవత శ్రీమహాలక్ష్మి - పాతకాలంగా లచ్చిమి, మాలచ్చిమి, నేటికాలంగా వెంకటలక్ష్మి, లక్షిందేవి, లక్ష్మికాంత. మిగతా ముగ్గురూ సావిత్రి, శకుంతల, జయమ్మ.

అందరికంటే పొడుగ్గా ఉండి చామనచాయలో కోలమొహం ఉండే శకుంతల ఎప్పుడూ నవ్వుతూనే ఉంటుంది. తాను చాలా లోకజ్ఞతగలదాన్నని, మిగతా అందరికంటే తెలివిగలదాన్ననీ అనుకుంటుంది. సబ్బుల కంపినీలో, సాంబ్రాణి కడ్డీల కంపినిలో, రేషం ఫాక్ట్రీలో, బిస్కెట్ ఫాక్ట్రీలో - అన్ని చోట్లా పనులు చేసిచూసింది. ఇవన్నీ తనకి కుదిరేవిగావనీ, ఇండ్లపనులే తనకు సరిపడుతవనీ తేల్చుకున్నప్పణ్ణుంచీ ఆ పన్లే చేస్తున్నది. సొంత పనులకు అవసరమైనప్పుడు చెప్పి, చెప్పకా నాలుగు రోజులు పనులు ఎగరగొట్టే సులువుంది దీన్లో. తెలివిగా వ్యవహరిస్తే మాట మంచితనంతో చాలా లాభాలు పొందవచ్చనీ గ్రహించింది. ఇప్పటికిప్పుడు అవసరమైతే అయిదొందలు అప్పు పుట్టించుకోగల పరపతి సంపాదించింది పనిచేస్తున్న ఇళ్ళలో. తనలాగే టవున్లో ఇండ్ల పనులు చేసుకునే లక్షిందేవితో లోక వ్యవహారాలు మాట్లాడుతూ నడుస్తున్నది.

"అసలు మనకు గవర్మెంటు లోను ఎందుకిచ్చింది? పేదోళ్ళము, ఇల్లు కట్టుకోలేమనిగదా. లోను డబ్బులు నెల మొదటివారం ఠంచనుగా తీసుకెళ్ళి కలెక్ట్రాఫీసులో ముడుపు చెల్లిస్తే ఇహ మనం పేదోళ్ళమెట్లా? అడగ్గా అడగ్గా ఒకేతూరి రెండ్నెల్లకో, మూడ్నెల్లకో ఇల్లు బీగాలేస్తామని బెదిరించినప్పుడు అన్నా, అన్నా అంటూ కొంత కుదవపెట్టి ఇయ్యాలి..." అన్నది శకుంతల హితబోధ చేస్తూ.

"డబ్బు ఎక్కువైకాదమ్మ...ఇంటికి మళ్లేమన్నా మోసమొస్తదేమోనని..." అంటూ నసిగింది లక్షిందేవి.

"ఇవాళ చాలా ఆల్సెమైపోయింది నాకు....అంగడింటి ఆయమ్మ దేవుడూ మయిమలూ చెప్తా ఉంటే అట్టే ఇంటూ ఉండిపోయా......ఎంటో చెప్తారు, అయన్నీ నిజమేనా అనుకుంటున్నా...కడాకి రేపుగాదికి పాత చీర ఇస్తానన్నది..... పాతదన్న పేరేగాని బాగుంది చీర. ఎర్రపువ్వులుండే పచ్చచీర. నైలాన్‌ది.... ఎన్నాళ్ళబట్టో ఆ చీరమీద పడ్డది నా కన్ను...." చెప్పుకుపోతున్నది శకుంతల.

"మన పన్జూసుకురావాలగాని ఇట్టా సోది పెట్టుకుంటే ఇంటో నీ పిల్లలేం జేస్తన్నారో" అన్నది లక్షిందేవి.

"ఆఁ తిని సదూకొని నిద్రబోతారు. పన్జూసుకొని పరిగెట్టి వస్తే పాత చీర ఎట్లొస్తది?" అని నవ్వి "పండక్కి ఇంటో అందరికీ కొత్తబట్టలు తీస్తన్నా" అన్నది శకుంతల ధీమాగా.

కడప బస్సు వేగంగా రావటం చూసి అందరూ నడక ఆపి రోడ్డు పక్కగా ఒదిగి నిలబడిపోయారు.

రోడ్డుకు ఎడంగా సారా కొట్టు దగ్గరున్న గుంపు ఎనిమిది గంటలవుతున్నందున ఇళ్ళు చేరే ధ్యాస కలిగి రోడ్డుమీద పోతున్న జనాన్ని పరికించి చూస్తూ ఒక్కొక్కరే పైకి లేస్తున్నారు.

బస్సు దాటిపోగానే ఆడవాళ్ళందరూ తిరిగి రోడ్డు మీదకు ఎక్కారు.

చిత్రాలు : కె. త్రిశూల పాణి



సరిగ్గా అప్పుడే శకుంతల మెడమీద వెనక నుంచి చెయ్యిపడింది.

అప్పుడప్పుడు శకుంతల పని నుంచి ఇంటికి వెళ్తున్నప్పుడు ముందుగా చెప్పా పెట్టకుండా ఊరి నుంచి వచ్చిన తమ్ముడు వెంకటేశు ఇలాంటి ఆకతాయి పనులు చెయ్యటం మామూలే. వెనక నుంచి గబాల్న కళ్ళు ముయ్యటం, వీపు మీద ఫట్‌మని దెబ్బవెయ్యటం, చేతిలోని సంచీని పీక్కోవటం, ఆ సంచీలోకి ఏద్దైనా బరువైన వస్తువును దభీమని పడెయ్యటం- తడవకో రకం అల్లరి వాడిది. 'ఎప్పుడొచ్చావురా వెంకటేశూ' అంటూ నవ్వుతూ పక్కకు తల తిప్పిన శకుంతలకు నల్లని బుర్రమీసాల్తో కర్కశమైన ముఖం కనబడ్డంతో భయపడిపోయి అరవటానికి నోరు తెరిచేంతలోనే వాడి చెయ్యి గబాల్న శకుంతల మెళ్ళో ఉన్న గొలుసును పట్టేసింది. మెరుపు వేగంతో వాడి రెండోచెయ్యి ఆ పక్కనే ఉన్న లక్షిందేవి గొలుసును పట్టింది. ఇద్దరూ కలిసి 'దొంగ! దొంగ!' అని పెద్దగా అరవటంతో ఒక్కడుగు ముందుగా వెళ్తున్న మిగిలిన ఆరుగురూ నిలబడి పోయి వెనక్కి చూశారు. దొంగ గొలుసుల్ని పట్టి లాగటంతో పొట్టిగా ఉన్న లక్షిందేవి ముందుకు వాలబడటంతో ఆవిడ గొలుసు తల మీదుగా జారి దొంగ చేతిలోకి వెళ్ళిపోయింది. శకుంతల గొలుసు తెగి ఒక చివర వాడి చేతిలో చిక్కింది. రెండో చివరను శకుంతల భయంతో బిగిసిన చేతిలో పట్టేసింది. ఆడవాళ్ళ కేకల్తో, అరుపుల్తో ఆ స్థలమంతా గగ్గోలు అయింది.

సారాకొట్టు దగ్గరున్న జనంలో చలనం వచ్చింది. అంతా పైకి లేచారు. కొందరు వీళ్ళవైపు పరుగెత్తుతూ వస్తున్నారు. తెల్లని పంచె, లాల్చీ వేసుకున్న భారీ విగ్రహం స్కూటర్ స్టార్ట్ చేశాడు. ముగ్గురు హడావుడిగా సైకిళ్ళ మీదికి గెంతారు. దొంగ ఒక్కసారిగా బలంగా పీకగానే శకుంతల చేతిలో ఉన్న గొలుసు చివరను వదిలేసింది. దొంగ పరుగు లంకించుకున్నాడు.

కొత్త కాలనీలు, పేటలు ఏర్పడ్డాక ఈ రోడ్డు మీద, ఇదే చోటు తమ పనులకు అనువని దొంగలు భావించటం ఇదే మొదటిసారికాదు. గడచిన మూడు నెలల్లో మూడు దొంగతనాలు సరిగ్గా ఇదేచోట జరిగాయి. తనను తరుముకొస్తున్న మనుషుల్ని చూసి పరిగెత్తుతున్న దొంగకు చుట్టూ చీకటీ,




950



చెట్లూ, ఒకవైపున మాత్రం పల్చని వెన్నెట్లో మైదానం కన్పించింది. ఇంతకుముందటి దొంగల్లాగే ఈ బుర్ర మీసాల వాడూ మైదానంలోకే పరుగెట్టాడు. వాడి వెనకాలే స్కూటరూ, సైకిళ్ళూ, మనుషులూ పరుగెట్టారు.

తనను వాళ్ళు చుట్టుముడుతున్నారని గ్రహించిన దొంగకు దిక్కు తోచలేదు. అక్కడే ఉన్న ఇటుకబట్టీల తాలూకు బురద గుంటలోకి దిగబడ్డాడు. తనకిహ మార్గాంతరం లేదని గ్రహించగానే స్కూటరు దిగివస్తున్న పెద్దమనిషి మీదకు బురద చల్లటం మొదలెట్టాడు. వెనకనే వచ్చిన వాళ్ళిద్దరు ఆ బురదలోకి దిగి దొంగను పట్టి పైకి ఈడ్చుకొచ్చారు. జనప్రవాహం కదిలి వీధిలైటు కిందకు చేరింది.

ఆ లైటు వెల్తురులో ఒక్కసారి తన బట్టలు చూసుకున్నాడు స్కూటరు పెద్దమనిషి. స్కూటరు టైరు కూడా ఒకటి పంక్చరయింది. దొంగను నేలమీద పడేసి కొందరు నత్తువకొద్దీ వేట్లు వేస్తున్నారు. తంతున్నారు. స్కూటరు పెద్దమనిషి నడుముకున్న సైకిలు చైను తీశారు. రెండు కత్తులు కూడా బయటకొచ్చాయి. కొంతసేపట్లోనే దొంగ ఆర్తనాదాల్తో ఆ చోటంతా మార్మోగిపోయింది.



"ఆడోళ్ళు ఇట్టా రండి" అన్నారెవరో. ఈ బీభత్సం చూడలేక పక్కకి తిరిగి నిల్చున్న ఎనిమిదిమందీ భయపడిపోతూ మెల్లగాలైటు వెలుగులోకి వచ్చారు.ఏం జరగబోతోందోనన్న భయంతో వాళ్ళ మొహాలు బిగుసుకుపోయి ఉన్నవి. దొంగమీద పడుతున్న దెబ్బలూ, వాడి పెడబొబ్బలూ అన్నీ వింటున్న వాళ్ళకి గుండెలు బేజారయిపోతున్నవి.

వాడిమీద పడుతున్న దెబ్బలకి వీళ్ళకి ఏడుపొస్తున్నది. 'ఎవరి మొఖం చూశాడో పొద్దున్నే లేచి' అని గొణుక్కున్నారు.

దొంగ పాంటు ఎప్పుడో లాగి పారేశారు. చొక్కా అంతా పేలికలైపోయింది. వాడి ఒంటి మీద చిన్న డ్రాయరు ఉంది. ఒళ్ళంతా వాతలూ, రక్తమూ పులుముకుపోయి ఉన్నవి. వాడి జేబుల్లో నుంచి తీసిన రెండు గొలుసులూ, ఒక పర్సూ, ఒక కత్తీ, ఒక కారంపొట్లం ఒక పక్కగా పెట్టి ఉన్నవి. స్కూటరు పెద్దమనిషి గొలుసులు తీసి పైకెత్తి చూపిస్తూ "ఇవి ఎవరివి?" అన్నాడు. శకుంతల ముందూ, లక్ష్మీదేవి వెనకాగా బిక్కుబిక్కుమంటూ భయంతో "మావేనన్నా" అంటూ ముందుకొచ్చారు. ఏం జరగబోతోందోనన్న భయం వాళ్ళను వణకిస్తున్నది. నోట్లోంచి మాటకూడా స్పష్టంగా రాలేదు. వాళ్ళ గొలుసులు వాళ్ళ చేతిలోకొచ్చినై. పర్సులో ఉన్న పది రూపాయల నోట్లకట్ట పెద్దమనిషి జేబులోకి పోయింది. ఒకతను కత్తిని తీసేసుకున్నాడు. ఇంకొకతను పొట్లంలోని కారం తీసి నేల మీద పడి ఉన్న దొంగమీద చల్లాడు. దొంగ ఒక్కసారిగా కెవ్వుమని పెడబొబ్బలు మొదలెట్టాడు.

**పెద్దమనిషి ఆడవాళ్ళని తిరస్కారంగా చూశాడు...**
**"అట్టయితే వాడు దొంగా కాదు...**
**మేం పెద్దమనుషులూ కాదు... ఈ ఆడోళ్ళ**
**నెవురూ బాగుజెయ్యలేరు" అన్నాడు.**

"ఎవరికోసంరా ఈ కారం? ఏంజేద్దామని తెచ్చినావు? మా సంజెయ్‌పేట మనుసులు డబ్బులేనోల్లురా. ఆడోల్లు పనులు జేసుకోపోతే దినం గడవదు. అంతా ఊల్లోకి పోవాల, సీకటడ్డాక ఈ దోవంటే రావాల. వాల్లమీద సెయ్యేత్తే మేం ఊరుకోం. రక్తం కల్లజూస్తాం!" అని దొంగని కాల్తో ఒక్క తాపు తన్నాడు.

స్కూటరు పెద్దమనిషి వరమిస్తున్న వేలుపులాగా దీటుగా నిలబడి శకుంతల వైపు జూసి "వీడిని ఏం చెయ్యాలి?" అన్నాడు. దొంగ ఏడుస్తూనే మట్టిలో పొర్లుకుంటూ వచ్చి శకుంతల కాళ్ళు పట్టేశాడు. "ఇంగెప్పుడూ ఇటు రాను, నన్నొగ్గెయ్ మహాతల్లీ!" అన్నాడు.

శకుంతల కంగారుగా వెనక్కి జరిగింది.

"ఈ కారం మీ కళ్ళల్లో జల్లటానికి - ఇదిగో ఈ కత్తి నీ కడుపులో దించటానికి తెచ్చాడు వీడు" అన్నాడు పెద్దమనిషి. "మా తల్లీ, నన్నొగ్గెయ్. ఇంగెప్పుడూ ఈ జలమలో ఈ పక్కకి రాను" అంటూ శకుంతల కాళ్ళు పట్టుకోటానికి ఇంకా ప్రయత్నిస్తూనే ఉన్నాడు దొంగ.

స్కూటరన్న కొంచెం ఆలోచించాడు. "సరే, ఈ కేసు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కి పోవాలి. అక్కడికి మేం రాము. వీడిని కట్టేసి ఒక ఆటోలో పడేస్తాం. మీరు పోయి స్టేషన్‌లో కంప్లైంట్ ఇవ్వండి" అన్నాడు.

అప్పుడు టైం రాత్రి పదిదాటింది. పోలీసులనేసరికి శకుంతలకి ముచ్చెమటలు పోసినై. రాతిబొమ్మలాగా నిలబడిపోయింది గుడ్లప్పగించి చూస్తూ.

స్కూటరతను అందరినీ కలయజూశాడు. "పోతారా!" అన్నాడు గట్టిగా.

శకుంతల వణకుతూ "వాణ్ణి ఒగ్గెయ్యన్నా! పాపం!" అన్నది.

పెద్దమనిషి ఆడవాళ్ళను తిరస్కారంగా చూశాడు. చుట్టూ ఉన్న అందరి ముఖాలూ చూశాడు. 'థూ' అని నేలమీద ఉమ్మేశాడు. బురద కొట్టుకుపోయిన తన బట్టలు చూసుకున్నాడు. పంక్చరై పోయిన స్కూటరు టైరును చూసుకున్నాడు. "అట్టయితే వాడు దొంగా కాదు, మీరు దొరలూ కాదు, మేం పెద్దమనుషులూ కాదు!" అన్నాడు విసుగ్గా, కోపంగా. "ఈ ఆడోళ్ళ నెవురూ బాగుజెయ్యలేరు" అన్నాడు.

దొంగోణ్ణి చూసేసరికి అతనికి పల్లమాలిన కోపం వచ్చేసింది. "ఒరే, దొంగనాకొడకా....పోరా...పోరాపో... తప్పించుకొని పారిపోరా....నీ ప్రాణం తీస్తా" అంటూ రోడ్డువారనున్న రాయిని చేతిలోకి తీసుకున్నాడు. దొంగ గాబరాగా మూలుగుతూ కళ్ళు తుడుచుకుంటూ లేచి పరిగెత్తబోయాడు. విసురుగా వచ్చిన రాయి కాలికి తగిలి బోర్లాపడ్డాడు. "ఒరే, నాకొడకా, తొందరగా పరిగెత్తు ....లేకపోతే చంపుతా" అంటూ మరొక పెద్ద రాయి చేతిలోకి తీసుకున్నాడు. దొంగ ప్రాణభయంతో తత్తరలాడుతూ పరుగెత్తుతుంటే వెనక నుంచి దూసుకొచ్చిన రాయి కొంచెంలో తప్పి పక్కగా పోయింది.

రాత్రి పదకొండవుతుంటే ఎనిమిదిమంది ఆడవాళ్ళూ గుంపుగా చేరి గుడ్డివెన్నెట్లో మెల్లగా నడక సాగించారు. "ఇక నీ గతేమవుతుందోనని నాకు డౌటుగా ఉంది" అన్నది జయమ్మ శకుంతలతో. శకుంతల మాట్లాడలేక మౌనంగా వింటూ నడుస్తున్నది. "ఆ స్కూటరన్న ఎవురో తెలుసా?" అన్నది వెంకటలక్ష్మి గంభీరంగా. శకుంతల తెలీదన్నట్లు తలూపింది. "శివా!...శివన్న!..." అన్నది వెంకటలక్ష్మి.

శకుంతల శివన్నను చూడలేదుగాని, అతని గురించి చాల విన్నది. అతను సంజెయ్‌పేట గాంగ్ లీడరు. పేటకు అవతలి చివర్న ఉంటాడు. మంచికి మంచోడేగాని...అప్పుడే ఒకనాడు ఫుల్లుగా తాగేసి తన ఇల్లు గుర్తు చిక్కక పక్క వీధిలోని అమ్ములు ఇంట్లోకి వెళ్ళి "అన్నం పెట్టవే!" అన్నాడు. ఆవిడ వణకిపోతూ పెట్టింది. సుష్టుగా తిని "మంచమెయ్యే" అన్నాడు. అమ్ములు మెల్లగా తలుపు దగ్గరకు జరిగి పారిపోయుండొచ్చునా? తిక్కది, పారిపోకుండా అక్కడే పాతుకుపోయినట్లు నిల్చొని వణకుతూ "ఇది నీ ఇల్లుగాదన్నా!...నీది పక్క వీధి!...అక్కడ నీ భార్య ఉంది" అన్నది. శివన్నకు చాలా కోపం వచ్చింది. ఆవిడను జబ్బపట్టుకు ఈడ్చి గోడమీదకు విసిరేశాడు. తర్వాత ఆస్పత్రిలో అమ్ములు తలమీద మూడు కుట్లు పడ్డవి.

"శివన్న మనకోసం ఇంత అవస్థలు పడ్డాడు. నువ్వు దొంగోణ్ణి పోలీసుల కప్పగించకపోతివి! ఆయన్న ఎందుకంత కష్టపడ్డట్టు? ఆయన్నకి కోపం రాదా?" అన్నది జయమ్మ. "అటు దొంగోడూ చూసేసినాడు...ఊరుకుంటాడా? నీవల్లనే కదా ఆయన్నకి అన్ని దెబ్బలు తగిలింది! ఎప్పుడో, ఎక్కడో కాపేసి పగ తీర్చుకుంటాడు" అని తీర్మానించారు అంతా కలిసి.

"ఆయన్నని నేను పోలీసు స్టేషనుకు తీసుకెళ్ళలేదే? ఒగ్గెయ్యమని చెప్పినాను కదా. నేనేం తప్పు జేసినా?" సమర్థించుకోబోయింది శకుంతల.

"అయినా, 'మెడమీద చెయ్యి పడగానే గొంతుకొద్దీ గాడిద ఓండ్రపెట్టినట్టు అరిచెయ్యడమేనా? అసలవి బంగారు గొలుసులు కూడా కావుగదా. పిచ్చి గొలుసు కోసం నెత్తికి తెచ్చుకున్నావు." అందరూ కలిసి కొప్పడి తలోరకంగా బుద్ధి చెప్తుంటే, తను చేసిన తప్పుకు చింతిస్తూ భవిష్యత్తు భయపెడుతుండగా మెల్లగా ఇల్లు చేరింది శకుంతల అర్ధరాత్రికి. ■